కాలనీల అభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన సిప్ అబాకస్ విద్యార్థులు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: ఇటీవల జరిగిన తెలంగాణ ప్రాంతీయ స్థాయి సిప్ అబాకస్ మెంటల్ అర్థమెటిక్ కాంటెస్ట్ పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా 60 కేంద్రాల నుంచి 2,100 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో కేవలం 11 నిమిషాల్లో 200 లెక్కలు చేయాల్సి ఉంటుంది. ఆర్‌కేపురం వాసవీ కాలనీ సిప్ అబాకస్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 21 ట్రోఫీలు గెలుచుకున్నారు. ఎం కార్తికేయ (లెవల్7) చాంపియన్‌గా నిలిచారు. ఆస్తిక్, జ్ఞానిరెడ్డి(లెవల్ 1), ఆశిష్ (లెవల్ 4), సీహెచ్ ధీరజ్, పి హరిణి (లెవల్ 5), జి అవ్యక్త్, నాగ విదిత్, సాయి వెన్ను (లెవల్ 3), హవిషా రమణి (లెవల్8), కె వేదాంత్ రెడ్డి (జీఎంబీ) 2వ రన్నరప్‌గా నిలువగా, కె శ్రీతన్‌రెడ్డి (లెవల్ 1), పి శ్రీనిక (లెవల్ 2), వైసహస్ర రెడ్డి, రాజ్ విహాన్ రెడ్డి (లెవల్ 3), ఆదిత్య(లెవల్ 4), కె భవిష్, ఎస్ సాయి, అఖిలేష్ (లెవల్ 5), సి శివానిరెడ్డి(లెవల్ 7), జి అమితేష్‌రెడ్డి (జీఎంసీ) 3వ రన్నరప్‌గా నిలిచారు. మంగళవారం సిప్ అబాకస్ వాసవి కాలనీ కొత్తపేట్ నిర్వాకురాలు సంధ్యారాణి, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

సీఎంను కలిసిన లింగాల కిషోర్‌గౌడ్



నాగోలు: కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్ మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో నియమించే నామినేటెడ్ పదవిలో తనకు అవకాశం కల్పించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

మీర్‌పేట: ఆశవర్కర్లకు పనిభారం తగ్గించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, శేఖర్‌యాదవ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బాలాపూర్ మండల కమిటీ ఆశవర్కర్లతో మీర్‌పేటలోని పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మూసీనది బఫర్‌జోన్ గుర్తింపునకు సర్వే

సమాచారం లేక పోడంతో స్థానికుల భయాందోళన


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేటలో మూసీనది బఫర్ జోన్ గుర్తింపునకు మంగళవారం రెవెన్యూ, హెచ్‌ఎండీఏ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. కొత్తపేటలో సత్యనగర్ జనప్రియ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో మూసీనది డెవలప్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసులతో కలిసి సర్వే నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా సర్వే నిర్వహిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పవన్ కుమార్ అక్కడికి చేరుకొని అధికారులను అడిగి విషయం తెలుసుకున్నారు. మూసీనది డెవలప్‌మెంట్ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో మూసీ నది బఫర్ జోన్ 50 మీటర్ల దూరంలో ఉన్న ఇండ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ ఏవేవి ఉన్నాయని మాత్రమే తెలుసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నాగోల్ నుంచి మారుతీ నగర్ వరకు మూసీకి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని సర్వే చేస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వేడుకలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పంచముఖ ఆంజనేయస్వామి 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, ఘటాభిషేకాలు, ఆకుపూజ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సంతోషికుమారి, చైర్మన్ మోహన్‌రెడ్డి, రవికుమార్, వీఎస్ఎన్ మూర్తి, జీకేగుప్తా, నాగరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న రోడ్లు, పైప్‌లైన్లు, కమ్యూనిటీ హాల్ ఇతర సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ కోరారు. మంగళవారం ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తపేట డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను కార్పొరేటర్ వివరించారు. జోనల్ కమిషనర్ ఎల్లుండి డివిజన్‌లో పర్యటించి సమస్యలను పరిశీలిస్తామని తెలిపారని కార్పొరేటర్ వివరించారు.


జోనల్ కమిషనర్‌తో కార్పొరేటర్

రైతుబంధు పథకంపై అభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న చామ కృష్ణారెడ్డి

హయత్‌నగర్: మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకే రైతు బంధు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామని హయత్‌నగర్ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అన్నారు. రైతు భరోసా పథకంపై మంగళవారం సంఘం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతుకు ఎంత భూమి ఉన్నా 10 ఎకరాల వరకు మాత్రమే రైతుబంధు సాయం అందించాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీఏఓ నాగలింగాచారి, రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, డైరెక్టర్‌లు రాజశేఖర్‌రావు, నర్సింహారెడ్డి, గడ్డం యాదమ్మ, నర్సమ్మ, సుధాకర్‌రెడ్డి, అంజయ్య, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ముందస్తు ఏర్పాట్లు



ఉప్పల్: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఉప్పల్ మహంకాళి ఆలయం వద్ద రూ.22 లక్షలతో నిర్మిస్తున్న ఓపెన్ డ్రైనేజీ, సీసీరోడ్డును పరిశీలించి త్వరిత గతిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మిగిలిన ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ వసంత, స్థానిక నేతలు జగన్నాథ్, మీనంపల్లి అండాలు, ప్రభాకర్‌రెడ్డి, పాలడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

హుడాకాంప్లెక్స్: ఈ నెల 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్ మాట్లాడుతూ.. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేతను ఆపాలని, ఐఐటీ ప్రవేశాల్లో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని, యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పా లని, విద్యార్థులు, విద్యార్థి నాయకులపై పెట్టి న అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ బంద్ చేస్తున్నామని వివరించారు.

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ రెసిడెన్షి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌ను ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. కాలనీ ప్రజలు సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రూ.6 లక్షల ఆర్థికసాయం అందించారని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్ చౌదరి, సుమన్ గౌడ్, మాధవరం నర్సింహారావు, రమేష్ నాయుడు, మల్లేష్ గౌడ్, రవి ముదిరాజ్, వెంకట్ స్వామి, రాఘవేంద్రరావు, రాంబాబు, కాలనీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్లతోనే ఫ్లై ఓవర్ నిర్మించాలి


ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వనస్థలిపురం పనామా వద్ద రాబోయే ఫ్లై ఓవర్ పనుల్లో రెండు వైపులా గోడలు కట్టి మట్టితో నింపే ప్రతిపాదనలు విరమించుకోవాలని, పిల్లర్లతో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్‌లో ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డిని మంగళవారం కలిసి మూడు ప్రధాన ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరానికి ప్రధాన ద్వారమైన ఇట్టి ప్రదేశంలో నిర్మించే ఫ్లై ఓవర్‌ను మట్టితో నిర్మిస్తే ప్రధాన నగరం యొక్క అందం, శోభ పోతుందని తెలిపారు. రెండవ ప్రతిపాదనలో భాగంగా హయత్‌నగర్ దాటాక రేడియో స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్ పక్కన వినాయక విగ్రహాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్న కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. మూడవ ప్రతిపాదనలో భాగంగా.. పనామా చౌరస్తాను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్టీఆర్ చౌరస్తాగా నామకరణం చేసిందని తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని పక్కకు తొలగిస్తున్న నేపథ్యంలో మళ్లీ అట్టి విగ్రహం ఎక్కడ పెట్టాలో అనే విషయంలో చర్చించాలని కోరారు. పై ప్రతిపాదనలపై స్థానికులచే చర్చలు జరిపి తగు నివేదిక ఇవ్వాలని చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డి కిందిస్థాయి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 40, వంకాయ 35, బెండ 35, పచ్చి మిర్చి 70, కాకర 38, బీర 28, క్యాబేజి 35, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 15-18, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 27, క్యాప్సికం 70, ఆలు 38, దోస 23, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 35.
గమనిక: ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రవీంద్ర భారతిలో అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ప్రమీల, డీఈ క్రాంతి కుమార్, సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లకు నిధులివ్వండి



వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: బోనాల పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు దేవాలయాల వద్ద నిర్వహించాల్సిన అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జోనల్ కమిషనర్ వెంకన్నను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు దేవాలయాల సమీపంలో సీసీ, రహదారి ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరారు.

బోనాలకు భారీ బందోబస్తు


చాదర్‌ఘాట్ సీఐ సైదులు

చాదర్‌ఘాట్: బోనాల పండుగకు ఎలాంటి అవంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చాదర్‌ఘాట్ సీఐ సైదులు తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. స్టేషన్ పరిధిలో దాదాపు 20 వరకు దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 10 వరకు సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, ఆ ఆలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. త్వరలో కాలనీ ప్రెసిడెంట్‌లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ప్రతీ దేవాలయం వద్ద కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. సమేవేశంలో ఎస్ఐ రవికాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్


హయత్‌నగర్‌లో కుమ్మరికుంట చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్

నాగోలు: ఆయా డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. హయత్ నగర్ సర్కిల్‌లో వివిధ శాఖల అధికారులు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి మంగళవారం నాగోలు, మన్సురాబాద్, హయత్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. నాగోల్ నుంచి తాజ్ హోటల్ వరకు ప్రతిపాదించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నాగోల్ చెరువు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఆనంద్ నగర్ చౌరస్తా ఆధునీకరణ పనులను పరిశీలించారు. మన్సురాబాద్ డివిజన్‌లోని బిగ్ బజార్, మన్సురాబాద్ చౌరస్తా మీదుగా సుష్మా రోడ్డు వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించి.. చెరువులోకి డ్రైనేజీ మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గణేష్ నగర్ కాలనీ నుంచి చేపడుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హయత్‌నగర్ ప్రాంతం పరిధి దుర్గా నగర్ నుంచి కుంట్లూరు రోడ్డు వరకు చేపట్టాల్సిన సీసీ రోడ్డు పనులు, శివం హిల్స్ నుంచి వీరన్నగుట్ట వరకు లింక్ రోడ్డు పనులు చేయించాలన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరి కుంట చెరువు, బాతుల చెరువును పరిశీలించి అక్కడ బేబీ పాండ్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదన తయారుచేసి పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. వేంకటేశ్వర కాలనీ, గాయత్రీ బ్యాంక్ కాలనీ ఇంటర్నల్ రోడ్స్ ప్రతిపాదనలను పరిశీలించారు. కార్యక్రమంలో హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ రంజిత్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎలక్ట్రికల్ పున్నానాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దామోదర్, ఎండమాలజీ ఏఈ రవీంద్రనాథ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు నియంత్రించాలి

ప్రగతిశీల సంఘం రాష్ట్ర నాయకులు


మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

మీర్‌పేట: మాదక ద్రవ్యాలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏళ్ల లోపు పిల్లల నుంచి యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మీర్‌పేట పరిధిలో మత్తు పదార్థాల వినియోగం పెరగడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచిస్తూ, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ జి.సైదులు, పీవైఎల్ బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేష్, సహాయ కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బదిలీపై ఫిర్యాదు


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

బడంగ్‌పేట్: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌గా ఏర్పడినప్పటి నుంచి పదేళ్లుగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వంకాలయ యాదగిరిని వేరే చోటకు బదిలీ చేయాలని కోరుతూ మంగళవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు సక్రమంగా నిర్వర్తించకుండా తనకు నచ్చిన కార్పొరేటర్లకు, రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు సార్లు బదిలీలు అయినా కొందరి నాయకుల అండదండలతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లో డిప్యూటేషన్ వేయించుకుంటున్నారని తెలిపారు. కార్పొరేషన్‌లో పనిచేయని యాదగిరి డిప్యూటేషన్‌ను రద్దు చేసి సొంత పోస్టింగ్ ఎక్కడ ఉందో అక్కడికి పంపించి వేరే వ్యక్తిని బడంగ్‌పేట కార్పొరేషన్‌లో విధులు నిర్వహించేలా చూడాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మీర్‌పేట: పేద ప్రజలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చుల నిమిత్తం స్థానిక కార్పొరేటర్ సౌందర్య విజయ్, ఎమ్మెల్యే సహకారంతో వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి రేణుక భర్త రాములుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి


నోటు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. మంగళవారం ఎల్‌బీ నగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్‌లో గల భూపేష్ గుప్తానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీఐటీయూ ఎల్‌బీ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, నాయకులు మంతాని యాదయ్య, కె.వెంకటయ్య, పి.శ్రీనివాస్, సంతోష్, వి.బుచ్చమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మధుసూదన్‌గుప్తా

హస్తినాపురం: ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలోని శివాలయం వద్ద కామినేని ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో బిజ్జాల వేణు గుప్తా, బండ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



జడ్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ తూర్పు జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీ, నాగార్జున కాలనీ, వెంకటరమణ కాలనీ, మల్లికార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో ఆయన జోనల్ కమిషనర్‌ను కలిశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు హరీందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, నవీన్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ అన్నారు. ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, సిగ్నల్ క్రాసింగ్, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాము, ఏఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనా వ్యూహాలపై నేడు రాష్ట్ర స్థాయి సెమినార్

మలక్‌పేట: ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ (ఫెడ్) సమన్వయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ అండ్ సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఫెడ్ చైర్మన్ మద్దెల గంగారామ్, సెక్రటరీ జనరల్ చెరుకు నాగభూషణం మంగళవారం తెలిపారు. సోమాజిగూడ రాజ్‌భవన్ క్వార్టర్స్‌లోని సంస్కృతి హాల్‌లో బుధవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెమినార్ కొనసాగుతుందన్నారు. ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రొఫెసర్ కోదండరామ్, ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం, డబ్ల్యూసీడీ, ఎస్ఆర్.సీ అండ్ టీజీ వెల్ఫేర్ సెక్రటరీ వాకాటి కరుణ, పాఠశాల విద్య కమిషనర్ వెంకట్ నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు, మెయిన్ స్ట్రీమ్ విద్య యొక్క ప్రభావంతో పిల్లలకు బోధనా వ్యూహాలు అనే అంశంపై సెమినార్ ఉంటుందని తెలిపారు.

విస్తరాకుల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో మంగళవారం సాయంత్రం విస్తరాకుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.10 లక్షల విలువైన యంత్ర సామగ్రి, ముడి సరుకు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రినగర్ కాలనీలో బీఆర్ఎస్ కంపెనీ పేరుతో ఓ పేపర్ ప్లేట్ల తయారీ కంపెనీ ఉన్నది. మిషన్లు అధికంగా హీట్ కావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.